BREAKING EDITION
బ్రేకింగ్ ఎడిషన్

Follow: @ANNTELUGU
మహా పత్రిక
శనివారం, హైదరాబాద్ 22-02-2025
WWW.EPAPER.MAHAADAILY.COM
ANN తెలుగు

బీసీ నేతలతో సీఎం రేవంత్ భేటీ

కీలక అంశాలపై చర్చ

మహా, హైదరాబాద్: తెలంగాణలోని బీసీ సంఘాలు, ఇతర ముఖ్య నేతలతో శనివారం ప్రజా భవన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. ఈ సమావేశానికి పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ బీసీ నాయకులు, బీసీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, సెక్రటరీలు హాజరయ్యారు. ఈ సమావేశం సందర్భంగా 42 శాతం బీసీ రిజర్వేషన్ల చట్టం కోసం ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు, తీర్మానం చేయడానికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలు, బీసీల సంక్షేమానికి అమలుచేస్తున్న కార్యక్రమాలపైనా చర్చ జరిగే అవకాశం ఉంది. ఇక బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంపై ఆ సామాజికవర్గ నేతలతో సీఎం రేవంత్ రెడ్డి డిస్కస్ చేయనున్నట్లుగా తెలుస్తోంది.

కుప్పకూలిన ఎస్ఎల్‌బీసీ టన్నెల్

శ్రీశైలం ఎడమగట్టు కాలువ టన్నెల్ వద్ద ప్రమాదం

మూడు మీటర్ల మేర పడిపోయిన పైకప్పు

స్వల్పగాయాలతో బయటపడిన పలువురు కార్మికులు

మరికొందరు అందులో చిక్కుకున్నట్లు సమాచారం

ప్రమాదంపై సీఎం దిగ్భ్రాంతి..

అధికారులకు కీలక ఆదేశాలు

హుటాహుటిన బయలుదేరిన మంత్రి ఉత్తమ్

మహా, నాగర్‌కర్నూల్: ఎస్ఎల్బీసీ టన్నెల్ వద్ద శనివారం ఉదయం ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో మూడు మీటర్ల మేర పైకప్పు పడిపోయింది. ఎడమవైపు సొరంగం 14వ కిలోమీటర్ వద్ద ప్రమాదం చోటు చేసుకుంది. ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలనే లక్ష్యంతో ఇటీవల ప్రభుత్వం పనులను తిరిగి ప్రారంభించింది. ఇందులో భాగంగా నాలుగు రోజుల క్రితం పనులు ప్రారంభమయ్యాయి. ఉదయం ఆ పనుల్లో ప్రమాదం చోటుచేసుకుంది. టన్నెల్ పైభాగంలో మూడు మీటర్ల మేర పడిపోయింది. నాగర్‌కర్నూల్ జిల్లాలోని దోమలపెంట సమీపంలో పనులు జరుగుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. అధికారులు ఘటనాస్థలికి వెళ్లి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. మరోవైపు ప్రమాదంపై సీఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తక్షణ సహాయక చర్యలపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.

ప్రమాద సమయంలో సుమారు 45 మంది అక్కడే..

ప్రమాద సమయంలో టన్నెల్‌లో 4045 మంది దాకా కార్మికులు ఉన్నట్లు సమాచారం. ఈ ప్రమాదంలో పది మంది కూలీలకు గాయాలు కాగా.. మరికొందరు టన్నెల్లో చిక్కుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం అక్కడ సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. కార్మికులంతా ఇతర రాష్ట్రాలకు చెందినవారే!. ఇప్పటిదాకా ముగ్గురు కార్మికులను బయటకు తీసుకొచ్చారు. వాళ్లను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అధికారులు ప్రమాద స్థలాన్ని చేరుకుని సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నారు.

సాగు, తాగునీరు అందించాలన్న లక్ష్యంతో..

నల్లగొండ జిల్లాకు సాగు, తాగు నీరందించేందుకు శ్రీశైలం ఎడమగట్టు కాలువ సొరంగం ప్రాజెక్టును రూపొందించారు. 2005లో ఎస్ఎల్బీసీ ప్రాజెక్టుకు నాటి వైఎస్సార్ ప్రభుత్వం రూ. 2,200 కోట్లతో పరిపాలన అనుమతులు జారీ చేసింది. రూ.1926కోట్లతో సుమారు 60 నెలల్లో పూర్తి చేయాలని నిర్మాణ సంస్థ పనులు పొందింది. శ్రీశైలం జలాశయం నుంచి నల్లగొండ జిల్లాకు 30టీఎంసీల కృష్ణ జలాలను తరలించాలన్నది ఈ ప్రాజెక్టు లక్ష్యం.

బీఆర్ఎస్ హయాంలో మూలన పడ్డ పనులు

టన్నెల్ బోరింగ్ మిషన్‌తో సొరంగం త్రవ్వకం చేపట్టగా సాంకేతిక సమస్యలు, వరద సమస్యలతో పనులు ఆగుతూ సాగుతున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో టన్నెల్ బోరింగ్ మిషన్ మరమ్మతులకు గురవ్వడం.. నిధుల కేటాయింపులు లేకపోవడంతో సొరంగం ప్రాజెక్టు పనులు 2019 డిసెంబర్ నుంచి మూలనపడ్డాయి. అయితే ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో నల్లగొండ మంత్రుల చొరవతో ఈ మధ్యే పనులు మళ్లీ మొదలయ్యాయి. ఇప్పటిదాకా ప్రభుత్వాలు ఆరుసార్లు ఈ ప్రాజెక్టు పనుల గడువును పొడిగించాయి. తాజా గడువు కూడా జూన్ 2026 వరకు ఉంది. 2017లో ఈ ప్రాజెక్టు అంచనాలను రూ.3,152.72కోట్లకు పెంచగా.. ఈ మధ్యే మరోసారి 4,637కోట్లకు పెంచారు. ఈ ప్రాజెక్టులో ఇప్పటిదాకా రూ.2,646కోట్లు ఖర్చు చేశారు.

హుటాహుటిన బయలు దేరిన మంత్రి ఉత్తమ్

'ప్రమాదం జరిగినట్లు తెలిసింది. ఘటనా స్థలానికి వెళ్తున్నా. లోపల ఎంత మంది చిక్కుకున్నారనే వివరాలు తెలియాల్సి ఉంది. అధికారులు సహాయక చర్యలు చేపడుతున్నారు' అని మంత్రి ఉత్తమ్ తెలిపారు.

దగా ఖానాలపై ఉక్కుపాదం

అనుమతిలేని ప్రైవేటు ఆస్పత్రులు సీజ్

- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు
- జిల్లా వైద్యాధికారి డాక్టర్ కోటాచలం

మహా, హుజూర్ నగర్: అనుమతులు, అర్హత లేకుండా ఆస్పత్రులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కోటాచలం హెచ్చరించారు. జిల్లాలోని పలు ప్రైవేటు ఆస్పత్రులను డీఎంహెచ్ఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. నేరేడుచర్ల లోని స్టార్ హాస్పిటల్, హుజూర్‌నగర్ లోని బాబు హాస్పిటల్‌ను పరిశీలించారు. ఎలాంటి అనుమతులు లేకపోవడమేకాకుండా, రోగులను దగా చేస్తున్నట్లు గుర్తించారు. అలాగే ఎక్కువ మోతాదులో స్టెరాయిడ్స్ వాడుతున్నట్లు గుర్తించి బాబు క్లినిక్ ను మూసివేసినట్లు డీఎంహెచ్ఓ తెలిపారు. ఆర్ఎంపీలు ఎక్కడైనా అర్హతకు మించి వైద్యం నిర్వహిస్తున్నట్లు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడితే సహించేదిలేదని వారిపై చట్టరీత్యా కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్టాటిస్టికల్ ఆఫీసర్ వీరయ్య ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నల్లగొండ జిల్లాలో 7వేల కోళ్లు మృతి

బర్డ్ ఫ్లూ కలకలం

మహా, నల్లగొండ: జిల్లాలో బర్డ్ ఫ్లూ కలకలం రేపుతోంది. ఏకంగా 7వేల కోళ్లు మృతి చెందాయి. కేతేపల్లి మండల పరిధిలోని చెరుకుపల్లి గ్రామ శివారు ప్రాంతంలో ఉన్న కోళ్ల ఫారంలో ఏకంగా 7 వేల కోళ్లు మృతి చెందాయి. చేసేదేమి లేక సదరు రైతు మరణించిన కోళ్లను జేసీబీ సాయంతో పెద్ద గోయ్యి తవ్వి అందులో పూడ్చి పెట్టాడు. మొత్తం కోళ్ల ఫాంలో 13 వేల కోళ్లకు వేయగా అందులో 7 వేల కోళ్లు మృతి చెందినట్లుగా బాధిత రైతుల ఆవేదన వ్యక్తం చేశాడు. సుమారు రూ.4 లక్షలకు పైగానే నష్టం వాటిల్లిందని.. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని పౌల్ట్రీ యజమాని వేడుకుంటున్నాడు. మరోవైపు బర్డ్ ఫ్లూ తెలుగు రాష్ట్రాల ప్రజలను భయపెడుతోంది. నిత్యం కలకలలాడే చికెన్ షాపులు వెలవెలబోతున్నాయి. బర్డ్ ఫ్లూ కారణంగా జనం చికెన్ తినేందుకు జంకుతున్నారు. ఊహించిన పరిణామంతో చికెన్ సెంటర్ల నిర్వహకులు, పౌల్ట్రీ రైతులు కన్నీళ్లు పెడుతున్నారు. కాగా, రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున కోళ్లు మృత్యువాత పడుతుండడంతో తెలంగాణ సర్కారు అలర్ట్ అయ్యింది. ఈ నేపథ్యంలోనే ఫుడ్ సేఫ్టీ అధికారులు వరుసగా దాడులు నిర్వహిస్తున్నారు. నాణ్యతగా లేని చికెన్ విక్రయిస్తున్న వ్యాపారులపై కొరడా ఝుళిపిస్తోంది. ఎన్నిసార్లు హెచ్చరించినా వ్యాపారుల ధోరణి మారకపోవడంతో అధికారులు కఠిన చర్యలకు ఉపక్రమించారు. కుళ్లిన చికెన్ అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం కావాలి

కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి

- జిల్లా యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులకు దిశానిర్దేశం
- క్యాంపు కార్యాలయంలో కీలక సమావేశం
- హాజరైన కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాల చారి

మహా, ఆదిలాబాద్: ప్రస్తుతం జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేద్దామంటూ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి, సీనియర్ నాయకుడు కంది కంది శ్రీనివాస రెడ్డి పిలుపునిచ్చారు. కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయం ఆదిలాబాద్ జిల్లా యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కంది మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా పని చేయాలని కోరారు. ప్రతి ఓటరును కలిసి అభ్యర్థించాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశం లో కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాల చారి, టీపీసీసీ జనరల్ సెక్రటరీ సత్తు మల్లేష్ పాల్గొన్నారు. అనంతరం కొత్తగా ఎన్నికైన యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులను కంది శ్రీనివాస రెడ్డి శాలువాలతో సత్కరించారు.